జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 30-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 687 పేజీలు: 4 వెల: రూ.7

# ఒక్కచోటే.. తొమ్మిదేళ్లు!

* సీసీఎస్‌లో నాటుకుపోయిన కానిస్టేబుల్ భాస్కరుడు
* బదిలీ కాకుండా మేనేజ్ చేయడంలో దిట్ట
* తోటి సిబ్బందిపై పెత్తనంపై విమర్శలు






**శ్రీకాకుళం క్రైం, మే 29 (వార్త):** పోలీసులకు మూడేళ్లకో, ఐదేళ్లకోసారి బదిలీ అవుతుంటుంది. అయితే శ్రీకాకుళం నగరంలోని సెంట్రల్ క్రైం స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ భాస్కర్ అయితే తొమ్మిదేళ్లుగా పాతుకుపోయాడు. కొందరు పోలీసు అధికారులకు మేనేజ్ చేసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని తోటి సిబ్బంది బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈయనకు ఎక్కడకైనా బదిలీ అయితే వెంటనే సీ నంబరుపై మళ్లీ జిల్లా కేంద్రానికి వచ్చేస్తున్నాడు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి.. అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి ఎవరెవరు ఎంతెంత కాలం నుంచి పనిచేస్తున్నారన్న జాబితాను తెప్పించుకుని బదిలీలు చేశారు. ఈ జాబితాలో భాస్కర్ తన పేరు లేకుండా మేనేజ్ చేసుకున్నాడని గతంలో విమర్శలు వ్యక్తమయ్యాయి. నాలుగు సంవత్సరాలు సీ నెంబరు, ఐదు సంవత్సరాలు డీవోతో సెంట్రల్ క్రైం స్టేషన్‌లో పాతుకుపోయాడు. రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఉన్నాయని, తనను ఎవరూ జిల్లా కేంద్రం నుంచి కదపలేరని ఈ కానిస్టేబుల్ తోటి సిబ్బంది వద్ద చెబుతుంటాడట. తొమ్మిదేళ్ల పాటు ఒకేచోట పనిచేస్తున్నాడంటే.. ఆయన చెబుతున్న మాటలు నిజమే అయివుంటుందని తోటి సిబ్బంది కూడా నమ్ముతున్నారట. అతనితో మనకెందుకులే అని వారంతా మౌనం వహిస్తున్నారు. అయితే సీసీఎస్‌లో అతని ఆగడాలు మరింతగా మితిమీరడంతో కొందరు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇతని అగడాలపై జిల్లా పోలీస్ బాస్ దృష్టి సారిస్తే భాస్కరుడి మరిన్ని బాగోతాలు బయటపడే అవకాశం ఉంది.



* కన్న కొడుకులే.. కాలయముళ్లు
* తల్లిని వదిలేసిన కన్నబిడ్డలు
* మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాటం
* ఆకలితో అల్లాడిన మాతృమూర్తి
* గొర్రెల కాపరి మానవత్వంతో నిలబడిన ప్రాణాలు
* శ్రీకాకుళంలోని కుమారులు, కుమార్తెల నిర్వాకం విమర్శలు

# అమానవీయం

**మందస/సోంపేట, మే 29(వార్త):** కన్న కొడుకులే కాలయములయ్యారు.. నవ మాసాలు మోసి, కని, పెంచిన తల్లిని కుమారులు వదిలించుకోవడానికి చేసిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా చేసింది. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మైలపిల్లి లక్ష్మి(60) అనే వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. వృద్ధాప్యంతో



పాటు అనారోగ్యానికి గురైన లక్ష్మి.. కుమారులు, కుమార్తెకు భారమయ్యింది. తల్లిని వదిలించుకోవడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. లక్ష్మిని ముగ్గురు కలసి, సుమారు 100 కిలోమీటర్లు తీసుకువచ్చి.. మందస-సోంపేట సరిహద్దులో వదిలేసి వెళ్లిపోయారు. రోడ్డు పక్కనైతే ఎవరైనా గుర్తు పడతారని, ముళ్ల పొదల్లోకి తీసుకువచ్చి వదిలేసి వెళ్లిపోయారు. మూడు రోజుల పాటు ఆ తల్లి నరకయాతన అనుభవించింది. ఓ వైపు ఎండ వేడిమి.. మరో వైపు ఆకలి.. ఇంకో వైపు అనారోగ్యం. ఇక మృత్యువు ఒక్కటే మిగిలింది. ఈ దారుణమైన పరిస్థితుల్లో ఆపద్బాంధవుడు కరుణించాడు. మందస మండలంలోని రట్టి గ్రామానికి చెందిన పులారి ఆకాష్ ముళ్ల పొదల నుంచి ఆర్తనాదాలు విన్నాడు. తక్షణమే అక్కడకు చేరుకున్నారు. ఓ వృద్ధురాలు ప్రాణాపాయస్థితిలో ఉండడాన్ని గమనించి సపర్యలు చేశాడు. తక్షణమే సీతయ్య ఫౌండేషన్‌కు సమాచారం అందించాడు. రహదారికి రెండు కిలోమీటర్ల దూరంలో అచేతనంగా పడి ఉన్న లక్ష్మిని ఆకాష్, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, గుళ్ల మోహనరావులు రక్షించారు. అనంతరం సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య చికిత్సలు చేసిన తరువాత ఆమె ఆరోగ్యం కుదుట పడడంతో.. సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చేర్పించారు. మానవత్వం మరిచి, కన్న పేగు బంధాన్ని తెంచుకుని, సభ్య సమాజం తలదించుకునేలా చేసిన కుమారులు, కుమార్తెలకు చూపరులు శాపనార్థాలు పెట్టారు. కాగా.. లక్ష్మిని కాపాడిన పులారి ఆకాష్, సానా గణేశ్, కిమ్మోజి ఢిల్లేశ్వరరావులను పలువురు అభినందించారు. మానవత్వానికి మాయని మచ్చగా మారిన ఇటువంటి వ్యవహారాల్లో పోలీసులు, న్యాయస్థానాలు సుమోటోగా తీసుకుని, చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'డయల్ యువర్ ఎస్పీ'



**శ్రీకాకుళం, మే 29 (వార్త):** జిల్లా పోలీసు సిబ్బందికి ఉద్యోగరీత్యా, వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే, నేరుగా తెలుసుకునేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది తమ సమస్యలను నేరుగా జిల్లా ఎస్పీ ఫోన్ నెంబర్ 6309990800 కు సంప్రదించి తెలియజేశారు. పలువురు పోలీసు సిబ్బంది వ్యక్తిగత సమస్యలు, లీవులు, సర్వీస్ సంబంధిత అంశాలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఫోన్ ద్వారా నేరుగా ఎస్పీకి వివరించారు. సిబ్బంది నుంచి వచ్చిన వినతులను శ్రద్ధగా విన్న జిల్లా ఎస్పీ, ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

**సోంపేట, మే 29(వార్త):** సోంపేట మండలం బహుశా భద్ర గ్రామానికి చెందిన ఓ మహిళ ఉపాధి పనికి వెళ్లి తిరిగి ఇంటికి చేరిన తర్వాత మధ్యాహ్నం వేళ మృతి చెందింది. వడదెబ్బకు గురై ఆమె మృతి చెందినట్లు కుటుంబీకులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన పల్లి మహాలక్ష్మి (50) గ్రామ సమీపంలో జరుగుతున్న నీటి బట్టి పనులకు అందరితో కలిసి శుక్రవారం ఉదయం వెళ్లింది. సుమారు పదిన్నర వరకు పనిచేసి 11 గంటల సమయానికి ఇంటికి తిరిగి వచ్చి విశ్రాంతి కోసం కాసేపు చేరబడింది. మధ్యాహ్నం తన కుమారుడు తల్లిని భోజనానికి లేపేందుకు ప్రయత్నించగా ఆమె అచేతనంగా ఉన్నట్లు గమనించాడు. అప్పటికే గ్రామంలో 104 సిబ్బంది కూడా ఉన్నారు. వారు వచ్చి పరిశీలించి, ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. రాత్రి వరకు అధికారులు ఎవరూ చేరుకోకపోవడంతో మృతదేహాన్ని అలాగే ఇంటి వద్ద ఉంచారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలికి భర్తతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



# సారవకోట తహశీల్దార్ విజయలక్ష్మికి పదోన్నతి



**- డిప్యూటీ కలెక్టర్‌గా నియామక ఉత్తర్వులు జారీ**

**సారవకోట, మే 29(వార్త):** సారవకోట మండల తహశీల్దార్ కె.విజయలక్ష్మికి డిప్యూటీ కలెక్టర్‌గా ఎ లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి సంబంధిత జీవో విడుదలైనట్లు శుక్రవారం విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని పలు మండలాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. ప్రభుత్వ పరిపాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేశానని పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఎక్కడ పోస్టింగ్ ఇస్తారనేది ఇంకా తెలియాల్సి ఉందని ఆమె వివరించారు. ప్రభుత్వ విశ్వాసానికి తగిన విధంగా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు.

విజయలక్ష్మికి పదోన్నతి లభించడంతో సహచర అధికారులు, ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకే ఆమెకు ఈ పదోన్నతి దక్కిందని పలువురు పేర్కొన్నారు.



# ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్య

**- ప్రత్యేక డ్రైవ్‌లో ఎంఈఓ ఎం.లక్ష్మణరావు**

**-15 మంది చిన్నారుల చేరిక**

**మందస, మే 28(వార్త):** బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో పర్యటిస్తూ.. చిన్నారుల తల్లిదండ్రులను ప్రభుత్వ విద్య, ప్రభుత్వ కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని వారు చెబుతున్నారు. మందస మండలంలోని అంబుగాం, లింబుగాం గ్రామాల్లో మందస మండల విద్యాశాఖాధికారి మన్రిపాటి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. దీంతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 15 మంది విద్యార్థులను ఒకే గ్రామం నుండి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు చేయడం జరిగింది. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను చేర్పించిన విద్యార్థుల తల్లిదండ్రులను ఎంఈఓ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు అభినందించారు. మరింత ఉత్సాహంతో ఈ డ్రైవ్ ను కొనసాగిస్తామని వారు తెలిపారు.

కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మన్రిపాటి లక్ష్మణరావుతో పాటు లింబుగాం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు, గున్న రాజు, పిన్నింటి కొండలరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సీతమ్మ, హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమస్యలపై ఎస్సీ కమిషన్ సభ్యునికి దళితుల వినతి

**ఎచ్చెర్ల (తోటపాలెం), మే 29 (వార్త):** ఎచ్చెర్ల మండలం తోటపాలెం గ్రామంలో దళితులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, శ్మశానవాటిక ఆక్రమణలపై శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాంను తోటపాలెం ఎస్సీ కాలనీ వాసులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ.. కాలనీలో దాదాపు 80 కుటుంబాలు నివసిస్తున్నాయని, తీవ్రమైన తాగునీటి ఎద్దడి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కావున తాగునీటి అవసరాల కోసం వెంటనే ఒక ప్రత్యేక బోరు బావి మంజూరు చేయాలని కోరారు. గతంలో నాగావళి నది ఒడ్డున ఉన్న ప్రభుత్వ స్థలంలో అంత్యక్రియలు నిర్వహించుకునే వాళ్లమని, కానీ భూముల రేట్లు పెరగడంతో కబ్జాదారులు ఆ శ్మశాన వాటిక స్థలాన్ని కూడా ఆక్రమించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు స్థలం లేక నరకయాతన పడుతున్నామని, తమకు శాశ్వత శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించి, అక్కడ రక్షణ గోడ, విశ్రాంతి భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు “ప్రజా పరిష్కార వేదిక”లో పలుమార్లు ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు పట్టించుకోలేదని కమిషన్ దృష్టికి తెచ్చారు. ఈ వినతిపై స్పందించిన సీతారాం మాట్లాడుతూ.. తాగునీటి బోరు, శ్మశాన వాటిక సమస్యల పరిష్కారానికి తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి దళితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.




కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యులు దండాసి రాంబాబు, జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు గంజి ఆర్.ఎజ్రా, తోటపాలెం అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు, జనసేన నాయకులు బలగ మోహన్, ట్రైబల్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నేతల రాంబాబు, ఉపాధ్యాయులు కలివరపు దుర్యోధన, పి.రాము, బి.సుధ, ఎమ్.వేణు, జి.దేవరాజు, కె.రాము, కిషోర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఏరియా కోడ్ మార్పు

**పలాస, మే 29(వార్త):** కాశీబుగ్గ సెక్షన్ పరిధిలో విద్యుత ఏరియా కోడ్ మార్పు చేశామని పలాస ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఐఎస్‌కె కృష్ణమూర్తి వెల్లడించారు.

కాశీబుగ్గ సెక్షన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఒకలి ముఖ్య గమనిక. ప్రస్తుతం ఉన్న బిల్లింగ్ విధానంలో మార్పులు రావడంతో, మన సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల విద్యుత్ సర్వీసుల 'ఏరియా కోడ్ మార్చబడిందని, ఈ మార్పు వల్ల ఆన్‌లైన్ పేమెంట్ యాప్స్ (గూగుల్ పే, ఫోన్ పే, పేటియం) ఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో పాత సర్వీస్ నంబర్లను ఉపయోగించేటప్పుడు “నో రికార్డ్స్ ఫౌండ్ “ లేదా “ఇన్వాలిడ్ సర్వీస్ నెంబర్ “ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించవలసిన విషయాలు. వినియోగదారులు తమ మొబైల్ పేమెంట్ యాప్స్‌లో ఉన్న పాత సర్వీస్ నంబర్ వివరాలను ముందుగా ' డిలేట్ ' చేయాలని, ఆ తర్వాత, మీ ప్రస్తుత కొత్త విద్యుత్ బిల్లుపై ముద్రించిన కొత్త ఏరియా కోడ్‌తో కూడిన సర్వీస్ నంబర్‌ను మళ్లీ ' యాడ్ చేయాలని ', ఈ విధంగా కొత్త నంబర్‌ను యాడ్ చేసుకున్న తర్వాత మాత్రమే బిల్లు వివరాలు కనిపిస్తాయి, ఆన్‌లైన్ ద్వారా బిల్లు చెల్లింపులు సాధ్యమవుతాయి.




మీటర్ కాలిపోవడం, కేటగిరీ మార్పు లేదా ఇతర సాంకేతిక సమస్యల కోసం కార్యాలయానికి వచ్చే వినియోగదారులు కూడా ఈ కొత్త ఏరియా కోడ్ వివరాలను గమనించవలసిందిగా కోరుతున్నాము. ఏదైనా సందేహాలు ఉన్నా లేదా సాంకేతిక సమస్యలు ఎదురైనా వినియోగదారులు వెంటనే 94906 12808, 94906 12838, 85003 22734 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలి

**- భూసార పరీక్షలతో సరైన ఎరువుల వినియోగం సాధ్యం**

**- రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశం**

**నరసన్నపేట, మే 29 (వార్త):** సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే రైతులు మెరుగైన దిగుబడులతో పాటు దీర్ఘకాలిక సత్ఫలితాలను సాధించవచ్చని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండలం కంబకాయ రైతు సేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి ఆరోగ్యం కాపాడటంలో సేంద్రియ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూసారం తగ్గే ప్రమాదం ఉందని, సహజ పద్ధతుల్లో సాగు చేపట్టడం ద్వారా నేల నాణ్యతను మెరుగుపరచవచ్చని వివరించారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించిన ఆయన, పరీక్షల ద్వారా భూమిలో పోషకాల స్థాయిని అంచనా వేసి అవసరమైన మేరకే




ఎరువులు వినియోగించవచ్చని తెలిపారు. దీంతో ఖర్చులు తగ్గడంతో పాటు పంట దిగుబడులు కూడా మెరుగుపడతాయని చెప్పారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకుని లాభాలను పెంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ వెంకట మధు, ఏవో సూర్యకుమారి, శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలపై కందిరీగల దాడి



**సోంపేట, మే 29 (వార్త):** బారువ గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలపై పనులు చేపడుతుండగా శుక్రవారం సాయంత్రం కందిరీగలు దాడి చేసి గాయపరిచాయి. గ్రామ సమీపంలో నాయన వారి చెరువులో ఉపాధి పనులు జరుగుతుండగా ఒకసారిగా కందిరీగలు దాడి చేసి గాయపరచడంతో సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజేష్ ఖన్నా తోపాటు సాన కామేష్ సాన రాజేష్ తదితరులు గాయపడిన మహిళలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వైద్య సిబ్బంది గాయపడిన మహిళలను చికిత్స అందజేశారు. రాత్రి కల్లా బాధితులు చేరుకోవడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు. గాయపడిన వారిలో సానా రోజా, తాళ్ల మోహిని ఈరోతు లోల, ఈరోతు హేమావతి, తెప్పల చంద్రావతి ఉన్నారు.

# లారీ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



**పలాస, మే 29 (వార్త):** లారీ ఢీకొని బైక్ పై వెళు న్న వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన పలాస మండలం కొబ్బరి ఊరు సమీప జాతీయ రహదారిపై శుక్రవారం సంభవించింది. సోంపేట మండలం తాళ్లబద్ర గ్రామానికి చెందిన సాయికుమార్ బైక్ పై వెళుతుండగా కొబ్బరి ఊరు సమీపాన వెనుక నుండి లారీ ఢీకొంది. ఈ ఘటనలో సాయికుమార్ తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న పలాస 108 సిబ్బంది సత్యం,సురేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రునకు ప్రథమ చికిత్స అందజేసి 108 లో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# కాలువల పేరుతో రహదారుల ధ్వంసం

**-మారుతీనగర్‌లో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**

**- పంచాయతీ అనుమతి లేకుండానే పనులా?**

**-అధికారులపై స్థానికుల ఆగ్రహం**

**నరసన్నపేట, మే 29 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని మారుతీనగర్ 4, 5 వీధుల్లో మురుగు కాలువల నిర్మాణం పేరుతో రహదారులను ధ్వంసం చేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల నిర్మాణ పనులు ప్రారంభించకముందే రహదారులను తవ్వేయడంతో గత మూడు రోజులుగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం ఆయా ఇంటి యజమానులు మురుగు కాలువల నిర్మాణం కోసం రహదారిని తవ్వించినప్పటికీ, ఇప్పటివరకు కాలువల నిర్మాణ పనులు చేపట్టలేదని తెలిపారు. దీంతో రహదారులపై గుంతలు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు



పడుతున్నారని, చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికే భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులకు సంబంధించి పంచాయతీ అనుమతులు కూడా తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ధ్వంసమైన రహదారులను పునరుద్ధరించడంతో పాటు, అనుమతులు లేకుండా పనులు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# పది రోజులుగా పనిచేయని బోరు

**- తాగునీటి కోసం అవస్థలు పడుతున్న తామరపల్లి ప్రజలు**

**- అధికారులు వెంటనే స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, మే 29 (వార్త):** తామరపల్లి సచివాలయం పరిధిలోని బోరు పది రోజులుగా పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీలమ్మ తల్లి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఈ బోరు ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలు తాగునీటిని వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. అయితే బోరు మరమ్మతులకు గురై పనిచేయకపోవడంతో రోజువారీ అవసరాలకు నీటి కోసం ఇబ్బంది

లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వేసవి కాలంలో ఇప్పటికే ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారిందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా దూర ప్రాంతాల నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి బోరును తక్షణమే మరమ్మతు చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తాగునీటి సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం


# ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం

## - రైతులు వినియోగించుకోవాలని సూచన

**జలుమూరు, మే 29(వార్త):** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జలుమూరు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు ముందస్తుగా విత్తనాలను పొందుతూ సాగుకు సిద్ధం కావాలని సూచించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో వివిధ రకాల ప్రముఖ వరి విత్తనాలు నిల్వలో ఉన్నాయని చెప్పారు. అందుబాటులో ఉన్న విత్తనాల్లో మీఖ 1061 రకం 224.7 క్వింటాళ్లు, మీఖ 7029 రకం 238.5 క్వింటాళ్లు, మీఖ 1318 రకం 202.5 క్వింటాళ్లు నిల్వలో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా మీఖ 1064 రకం 55.3 క్వింటాళ్లు, ద్రూ 5204 రకం 50.75 క్వింటాళ్లు, మీఖ 1121 రకం 23.3 క్వింటాళ్లు, మీఖ 1224 రకం 12.3 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ధృవీకరించిన విత్తనాలనే వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా రైతులు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి విత్తనాలను పొందాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు అందించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.






# పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

## - ఉపాధి హామీ కార్మికులకు ప్రభుత్వ విద్యా సదుపాయాలపై అవగాహన

## -17 మంది తల్లిదండ్రుల అంగీకారం

**నరసన్నపేట, మే 29 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించే లక్ష్యంతో మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం సాయంత్రం పోతయ్యవలస గ్రామంలో ఉపాధి హామీ వేతనదారుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో కూడిన విద్యా విధానం గురించి వివరించారు. పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు మంచి వేదికగా నిలుస్తున్నాయని తల్లిదండ్రులకు తెలిపారు. అధికారుల ప్రచారానికి సానుకూల స్పందన లభించిందని, 17 మంది ఉపాధి హామీ వేతనదారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు శాంతారావు, దాలినాయుడు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని, ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ హెచ్‌ఎం భారతి పాల్గొన్నారు.



# మహిళా సాధికారతకు చారిత్రాత్మక బాటలు

## - స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగం

**పలాస, మే 29 (వార్త):** మహిళా సాధికారతకు బాటలు వేసిన టిడిపి పార్టీకి మహిళలు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు టిడిపి మహిళా కార్యకర్తలు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో శుక్రవారం మహిళా నేతల పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహానాడు వేదికగా మహిళా సాధికారతకు చారిత్రాత్మక బాటలు వేసి మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చూపించిన పార్టీగా తెలుగుదేశం పార్టీ చరిత్రలో నిలిచిపోతుందని పార్టీ మహిళ ప్రతినిధులు పేర్కొన్నారు. మహానాడు వేదికగా మహిళా రిజర్వేషన్లకు బలమైన పునాది వేస్తూ, ప్రకటనలకే పరిమితం కాకుండా చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదని కొనియాడారు. మహిళలకు రాజకీయ స్వేచ్ఛ, సముచిత స్థానం కల్పించినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహిళా సంక్షేమం – చారిత్రక నిర్ణయాలు: రాజకీయ ప్రాధాన్యత కల్పించి మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం నుండి, దేశంలోనే తొలి మహిళా స్పీకర్ నియామకం వరకు టీడీపీ పాత్ర మరవరానిదని అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కూడా చంద్రబాబు నాయుడుదే. ఆర్థిక స్వావలంబన (డ్వాక్రా) రాష్ట్రంలో 12 లక్షల డ్వాక్రా గ్రూపులను బలోపేతం చేసి, 1.12 కోట్ల మంది మహిళలకు ఉపాధి కల్పించారు. బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.68,830 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో టిడిపి పార్టీకే దక్కుతుందని, రాష్ట్రంలో 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో, ఇప్పటికే 1.20 లక్షల మందికి 45 శాతం పెట్టుబడి రాయితీతో ప్రోత్సాహం అందిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు – ప్రగతిని ఇస్తూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ప్రతి నెలా 37.92 లక్షల మంది మహిళలకు రూ.1,594 కోట్ల సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ జరుగుతోందని అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా, ఇప్పటివరకు 60 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. తల్లికి వందనంతో ఈ పథకం ద్వారా 43 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.8,745 కోట్లు జమ చేయడం జరిగిందని తెలిపారు. దీపం ఽ దీపం 2.0: వంటింటి కష్టాలను తీరుస్తూ మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నారు. మహిళా భద్రతకు పెద్దపీట వేస్తూ, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి జోలికి వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వేధింపులు, దాడులపై ఎలాంటి రాజీ లేకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందనే నమ్మకాన్ని మహిళల్లో కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. మహానాడులో తీసుకున్న ఈ నిర్ణయాలు ఎంతోమంది మహిళలను గృహాలకే పరిమితం కాకుండా, ప్రజా సేవలో భాగస్వామ్యులను చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ల వజ్జభవాని, జోగా త్రివేణి, మహిళా టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలికలు ఎంతో జాగ్రత్తగా ఉండాలి

## - కిశోరి వికాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## - ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి




**మందస, మే 29(వార్త):** సమాజంలో బాలికలు ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఐసీడీఎస్ సీనియర్ సూపర్ వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి కోరారు. మందస మండలంలోని మూలిపాడు, గోపాలపురం, సొండిపూడి గ్రామాల్లో కిశోరి వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో బాలబాలికలకు కిశోరి వికాసం కార్యక్రమంతో ఎంతగానో మేలు జరుగుతుందని జీవన నైపుణ్యాలపై బాల బాలికలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ పై అవగహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గర్భవతులకు తల్లి నుండి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా ఉండడానికి కౌన్సిలింగ్, వైద్యుల సలహాలు ఎలా తీసుకోవాలో చెప్పారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి సెలవులలో శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. కార్యక్రమంలో సంబంధిత అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



# మొగలిపాడు ఆంజనేయాలయంలో చోరీ

**మందస, మే 29(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన దున్నపూరు పంచాయతీ మొగలిపాడు గ్రామంలో దొంగతనం జరిగింది. గ్రామంలో గల శ్రీఆంజనేయ ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు పడి.. ఆలయంలో గల కొత్త, పాత సౌండ్ సిస్టంలను అపహరించారు. గుడి తాళాలను పగలగొట్టి, బలవంతంగా తలుపులు తెరచి, ఈ చోరీకి పాల్పడ్డారు. దేవాలయంలో దొంగలు పడ్డారని తెలియడంతో గ్రామస్తులు, భక్తులు సంఘటనా స్థలానికి చేరకుని, ఆలయాలకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై మందస పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు స్థానికులు తెలిపారు. కాగా, ఈ ప్రాంతంలో ఆలయాలు, గుడులలో పలుమార్లు దొంగతనాలు జరుగుతున్నాయని, ఆలయాల్లో నగదు, వస్తువులు చోరీకి గురవుతున్నాయని వారు చెప్పారు.



# పలాస డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తులహ్వానం

**పలాస, మే 29 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు అందరూ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ హిస్టరీ, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్, బి.ఎస్‌సి కంప్యూటర్ సైన్స్, బి.ఎస్‌సి జువాలజీ, బి.ఎస్‌సి మ్యాథమెటిక్స్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన NET , APSET, Ph.D అర్హత కలిగిన అధ్యాపక బృందం సేవలు అందిస్తున్నాయని, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్స్, సుసంపన్నమైన గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉద్యోగాల కోసము ప్రత్యేక శిక్షణ తరగతులు, సర్టిఫికెట్ కోర్సులు కూడా అందిస్తున్నారు. ప్రతి సంవత్సరము కళాశాల నుంచి 70% విద్యార్థులు,(నెలసరి వేతనం రూ.22,000) ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపినారు. అదనంగా, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థిని విద్యార్థుల కోసం ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ సదుపాయాలు కూడా కలవని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి కోరారు. 8074827378, 9490809288, 9490638480, 9440413573 ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# కాలువను శుభ్రం చేశారు

## - జాతీయ వార్తకు స్పందన

**సోంపేట, మే 29(వార్త):** మురుగు కూపంలా మారిన రోటరీ నగర్ వార్త కథనానికి పంచాయతీ అధికారులు సిబ్బంది వెంటనే స్పందించారు. రోటరీ నగర్ వీధిలో కాలువ నీరు నిల్వతో దుర్వాసన ప్రబలడం దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రచురించిన కథనంపై శుక్రవారం పంచాయతీ సిబ్బంది చేరుకొని కాలువను బాగు చేశారు. మురుగు నీరు ప్రస్తుతం ప్రవహిస్తూ వీధిలో ఇబ్బంది లేకుండా ఉండడంతో పలువురు ఆనందం వ్యక్తం చేశారు.





# నాయకులు.. సేవకులు..!

## మహానాడులో ఆదర్శంగా నిలిచిన టీడీపీ నాయకులు

**మందస, మే 29(వార్త):** నాయకులం కాదు.. సేవకులమంటూ పార్టీ కేడరుకు తెలుగుదేశం పార్టీ నాయకులు మార్గదర్శం చేశారు. మహానాడు ఏర్పాట్లు, సమావేశంలో ప్రసంగాలతో అలసిపోయిన ఆ నాయకులు కార్యకర్తలకు సేవలందించడానికి ముందుకు వచ్చారు. ఓ కార్యకర్తకు మనోధైర్యం రావాలంటే.. నాయకుడు వారితో మమేకం కావాలి. సరిగ్గా అదే పని తెలుగుదేశం పార్టీ నాయకులు చేశారు. ముఖ్యంగా భోజనాల ఏర్పాట్లు పర్యవేక్షించిన నాయకులు స్వయంగా పార్టీ కేడరుకు వడ్డన చేసి, సేవలు అందించారు. అప్పటి వరకు సమావేశంలో ప్రసంగించిన నాయకులు ఎండ వేడిమి తట్టుకుని, కార్యకర్తలకు సేవలందించడానికి ముందుకు రావడం పట్ల కేడరు ఆనందం వ్యక్తం చేసింది. అధికారం అంటే హోదా కాదని, బాధ్యత అని చూపించారని వారు అన్నారు. కార్యకర్తలకు స్వయంగా అన్నం వడ్డిస్తూ... మేమున్నాం అని భరోసా ఇచ్చారని కార్యకర్తలు చెప్పుకొన్నారు. మాటల్లో కాదు... చేతల్లో చూపించే నాయకులు పార్టీ కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తారని వారు చర్చించుకున్నారు. మండల పెద్దలు అన్నీ తామై నడిపిస్తే... కార్యకర్తలకు ఇంతకంటే ధైర్యం ఏముందని ఆనందం వ్యక్తం చేశారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## నేడు హరిపురంలో వంశధార సాధన కమిటీ సమావేశం

**మందస, మే 29(వార్త):** వంశధార సాగుజల సాధన కమిటీ ప్రత్యేక సమావేశం ఈ నెల 30(శనివారం)న నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు మార్పు మన్మథరావు చెప్పారు. ఉదయం 9గంటలకు మందస మండలంలోని హరిపురంలో గల మార్పు గ్రంథాలయంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ సమీక్ష, భవిష్యత్ కార్యక్రమం, 14-6-2026 సదస్సు గూర్చి చర్చ జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## రేపు యువీవీ ఓపెన్ టాలెంట్ టెస్ట్

**మందస, మే 29(వార్త):** ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక(యువివి) 24వ వార్షికోత్సవం సందర్భంగా నీలావతి గ్రామంలో ఉన్న యువివి గ్రంథాలయం, విద్యాకేంద్రంలో మే 31వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఓపెన్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న యువీవీ ప్రతినిధి ప్రకాశరావు తెలిపారు. ఇంటర్మీడియట్, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఇంగ్లీష్, అర్థ మెటిక్, రీజనింగ్, జనరల్ అవేర్నెస్, కరెంట్ అఫైర్స్ అంశాలపై 60 మార్కులుంటాయన్నారు. 60 నిమి షాల టకు ఓపెన్ టాలెంట్ టెస్ట్ ఉంటుందన్నారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని యువివి నిర్వాహకులు కోరారు.

### ఏపీ పీజీ సెట్‌లో శ్రీనిజ శర్మకు..
# స్టేట్ ఫస్ట్ ర్యాంక్



**ఇచ్ఛాపురం, మే 29 (వార్త):** ఏపీపీజీ సెట్(పోస్ట్ గ్రాడ్యువేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ )లో ప ట్టణానికి చెందిన తెన్నేటి శ్రీనిజ శర్మ తన సత్తాచాటి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాదించింది. శుక్రవారం సాయింత్రం విడుదలైన ఫలితాల్లో విద్యార్థిని స్టేట్ ర్యాంక్ సాదించటంతో సర్వత్రా అభినం దనలు తెలిపారు. శ్రీనిజా చదువుల రారాణి. టెన్త్ లో 10కి 10పాయింట్స్, ఇంటర్ లో 86శాతం, డిగ్రీలో 76 శాతం సాదించారు. పేజీ సెట్ తెలుగు సబ్జెట్లో స్టేట్ ర్యాంక్, హిస్టరీలో స్టేట్ 95 ర్యాంక్ సాదించటం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనిజ తల్లి గృహిణి, తండ్రి తెన్నేటి తేజేశ్వరశర్మ జ్యోతిష్యం చెప్పుకుంటూ పౌరోహిత్యం చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదించి మంచి ర్యాంకులు సాదించటం ఎంతో ఆనందంగా ఉందని తేజేశ్వరశర్మ చెప్పారు.తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ సాధించింది. అమ్మ పద్మజ గృహిణి, అక్క శ్రీజ డిగ్రీ యూనివర్సిటీ ఫస్ట్ ఇంగ్లీష్ లిటరేచర్ ఎంట్రన్స్ లో స్టేట్ 20వ ర్యాంకు సాధించింది. అక్కను స్ఫూర్తిగా తీసుకుంది చిన్నప్పటి నుంచి స్ఫూర్తిగా తీసుకోవడమే కాక పోటీ పడి చదువుకుంది.గోసేవ, వంటలు, ఇంటి పనుల్లో నాన్న పనుల్లో సహాయంగా ఉంటూ ర్యాంకులను తీసుకోవడం తల్లితండ్రులు ఆనందంలో ఉన్నారు.

# నాణ్యమైన ప్రాథమిక వైద్యమందించడమే లక్ష్యం

- పారా మెడికల్ సిబ్బంది సేవలు అభినందనీయం
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
- వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు



**నరసన్నపేట, మే 29 (వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందేలా చూడటమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ప్రాణాలను కాపాడే వృత్తిలో ఉన్న పారామెడికల్ సిబ్బంది సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నరసన్నపేట పట్టణంలోని శ్రీ సౌభాగ్యలక్ష్మి కళ్యాణ మండపంలో కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు" కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో పారామెడికల్ సిబ్బంది, ఆర్ఎంపీలు, కమ్యూనిటీ పారామెడిక్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో, ఆసుపత్రులు దూరంగా ఉన్న గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలను కాపాడటంలో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. వైద్య విజ్ఞానంపై అవగాహన పెంపుతో పాటు రోగి పరిస్థితి తీవ్రతను ముందుగానే గుర్తించి అవసరమైనప్పుడు సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించడం ద్వారా అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైద్య సేవల్లో నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో పారామెడికల్ సిబ్బంది సేవలు మరింత సమర్థవంతంగా ఉండేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. కె. అనిత, అదనపు డీఎంహెచ్‌వో డా. తాడేల శ్రీకాంత్, డా. బలగ మురళి, డా. పొన్నాడ గణేష్, నక్క యుగంధర్, నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తర్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి తిమ్మల విజయకుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పంగ రమేష్, ట్రెజరర్ కె. రాము, జాయింట్ సెక్రటరీ కాల్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లకు ప్రత్యేక డ్రైవ్

- ప్రైవేట్ స్కూళ్ల నుంచి విద్యార్థులను చేర్పించేందుకు చర్యలు
- ఇప్పటికే 26 మంది చేరిక
- మరో 150 మంది లక్ష్యం



**జలుమూరు, మే 29(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జలుమూరు మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓలు) బమ్మిడి మాధవరావు, ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం జలుమూరులో నిర్వహించిన అడ్మిషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తల్లిదండ్రులకు వివరిస్తున్నామని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇద్దరు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 26 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని, ఇంకా 150 మంది విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకుని కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకోవాలని ఎంఈఓలు కోరారు. విద్యా ప్రమాణాల పెంపు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సమస్యలు వింటాం.. పరిష్కరిస్తాం!

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్



**పలాస, మే 29 (వార్త):** మీ వద్దకే వచ్చి ఈ సమస్యలు తెలుసుకుని మేము పరిష్కరిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. ఒక నెల - ఒక నియోజకవర్గంలో నాలుగు పర్యటనలులో భాగంగా శుక్రవారం పలాస మండలం రాజగోపాలపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ భూ సమస్యలను వినతుల రూపంలో అందించారు.

సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసు కోవడం ద్వారా వాటి పరిష్కారం మరింత వేగంగా సాధ్యమ వుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరేలా చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. తక్షణమే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ గ్రామస్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలు, అవసరాలను తెలుసుకున్న ఆయన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వ హించిన రాజగోపాలపురం గ్రామస్తులకు, స్థానిక నాయకులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ విశ్వేశ్వరరావు, ఆర్డిఓ అప్పలరాజు, డిడిఓ రమేష్ నాయుడు, ఎమ్మార్వో కళ్యాణ్ చక్రవర్తి, ఎండిఓ వసంత్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్ తో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

- అర్జీల స్వీకరణలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి
- త్వరితగతిన సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



**పోలాకి, మే 29 (వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలు, ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు, పెన్షన్లు, విద్యుత్ సమస్యలు తదితర అంశాలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఓర్పుతో విని సంబంధిత అర్జీలను స్వీకరించారు. అత్యవసర సమస్యలపై వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# టీడీపీ నేత.. ప్రభుత్వ భూమి కబ్జా



**సంతబొమ్మాళి, మే 29 (వార్త):** ప్రభుత్వ భూములు అంటేనే మావేనన్నట్టుగా కొంతమంది రెచ్చిపోతున్నారు. విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే సంతబొమ్మాళి మండలంలో నౌపడ- వెంకటాపురం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని నౌపడ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని స్థానిక అధికార పార్టీ నాయకుడు ఆక్రమించేశాడు. సర్వే నెంబర్ 386 లో రోడ్డుకు ఆనుకుని ఉన్న సుమారు 6 సెంట్లు ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశాడు. అంతటితో ఆగకుండా ఆక్రమించిన స్థలం చుట్టూ పొడవైన కర్రలను పాతారు. ఆక్రమించిన స్థలం విలువ ప్రస్తుతం మార్కెట్ లో రూ. 50 లక్షలు వరకు ఉండొచ్చని అంచనా. ఆక్రమించిన స్థలం పక్కనుండి ప్రతిరోజు రాకపోకలు సాగించే అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. రెవిన్యూ అధికారుల నిర్లక్ష్యమే కబ్జాదారులకు వరంగా మారిందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మూలపేట పోర్టుతో నౌపడలో భూములకు విలువ పెరగడంతో ప్రభుత్వ స్థలంపై కన్ను పడితే చాలు వెంటనే కబ్జా చేస్తున్నారు. ఆక్రమణలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులు పలుమార్లు చెప్పిన సదరు వ్యక్తి పట్టించుకోలేదు. మా ఆధీనంలో ఉన్న భూమి అని, దీనికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయని సదరు అధికార పార్టీ నాయకుడు అధికారులకు చెప్తున్నాడు. పత్రాలు చూపించమని అధికారులు అడిగితే సదరు టిడిపి నేత ఇవ్వకపోవడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

### రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం..
# ప్రకృతి వ్యవసాయం

**ఇచ్ఛాపురం మే 29(వార్త):** కేసుపురం, కొఠారి రైతులకు ప్రకృతి వ్యవసాయం, ఎల్‌నినో ప్రభావం, విత్తన గుళిక లు తయారీపై కసుపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ అధికారి పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి మద్దిలి చిట్టిబాబు ఆధ్వర్యంలో రైతులతో కలిసి విత్తన గుళిక లు తయారు చేసి రైతులకు దాని ప్రాముఖ్యత, వినియోగం, ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం అందించే సుస్థిర సాగు విధానమని తెలిపారు. స్థానికంగా అందుబాటులో ఉన్న దీర్ఘకాలిక పంటలతో విత్తన గుళిక లు మరియు నవధాన్యాలు 10 రకాల జాతులు, 30 రకాల విత్తనాలు ద్వారా రైతుకు ఎంతో మేలు సమకూరుతుంది అదేవిధంగా భూమిలో స్థిర కర్బనం ఏర్పడి భూమిలో 56 రకాల పోషక శక్తులు మొక్కకు అందిస్తూ ఈపంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందుతాయని వివరించారు . ఆరోగ్యంగా పెరుగుతాయని, ఇది నేలలో సూక్ష్మజీవుల వృద్ధిని పెంచి భూసారాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. దీని వినియోగం వల్ల పంటల వేరువ్యవస్థ బలపడటంతో పాటు దిగుబడి నాణ్యత కూడా మెరుగుపడుతుందని రైతులకు తెలియజేశారు. వాతావరణానికి అనుగుణంగా రైతులు వినియోగించుకోవచ్చని సూచించారు. రసాయన సాగుతో పోలిస్తే ప్రకృతి సాగు పద్ధతులు నేల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, సాగు అయ్యేఖర్చుని కూడా గణనీయంగా తగ్గిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులకు తయారీ విధానం, పద్ధతులు, ఎకరానికి 6 కిలో ల వరకు వెయ్యాలి వాటిఅంశాలపై వివరించారు. గ్రామ రైతులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ రైతులు అవగాహన కార్యక్రమంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి ప్రకృతి తగ్గ మన ఇచ్ఛాపురం రైతులు అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతు అధికారులు చెప్పిన సూచనలు కూడా అవగాహన చేసుకుని మంచి ఆరోగ్యకరమైన పంటలు పండించే అవకాశం ప్రభుత్వ కూడా అవగాహన కల్పించడం శుభపరిణామం ప్రభుత్వం రైతులు కు మంచి ఆదాయం వచ్చే సహకారం అందుబాటులోకి రావడం ఆ అవకాశాలు మన ఇచ్ఛాపురం మండలం కేశుపురం పంచాయతీ రైతులు మహిళలు యువత పొందాలని కోరుతూ ఈ కార్యక్రమ లో రైతులు పి.పురుషోత్తం, ఎన్.చంద్రయ్య, బి.తిరుపతి,పి.వాసుదేవ్, ఎన్.వాలీ, చందనం, డి.కామరాజు, రైతులు, మహిళలు, ఆత్మీయులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546